జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 22 | మార్చి | 2025 ◆ పేజీలు : 4

## మత సామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్ విందు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



**పాల్వంచ (కలెక్టరేట్), మార్చి21 (ప్రజాజ్యోతి):** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు, శుక్రవారం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐ డి ఓ సి కార్యాలయంలోని ముస్లిం

మిగతా 2 లో...

- బినామీ పేర్లతో డీలర్ల పెత్తనం
- పర్యవేక్షణ లోపం .. పేదల బియ్యం పక్కదారి..



## జిల్లాలో అస్థవ్యస్తంగా...

# ప్రజాపంపిణీ వ్యవస్థ

**కొత్తగూడెం, మార్చి 21, ప్రజాజ్యోతి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపంపిణీ వ్యవస్థ అధికారుల పర్యవేక్షణ లోపంతో అస్థవ్యస్థంగా మారింది. అతి తక్కువ రేటుకు పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ లక్షలాది రూపాయలను దండుకుంటున్నారు. భద్రాద్రి జిల్లాలో 440 రేషన్ షాపులు ఉన్నాయి. వీటి పరిశీలన చూస్తే అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు అనుసరించాల్సిన రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో నిర్వహిస్తున్న రేషన్ షాపులు ఎక్కువ మొత్తంలో భినామిల పేర్లపై ఉండడం గమనార్హం. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు క్రమం తప్పకుండా రేషన్ షాపుల వద్ద సరఫరా చేయాల్సిన రేషన్ డీలర్లు ముచ్చటగా మూడు రోజులు తెరిచి మమా అనిపిస్తున్నారు. రేషన్ షాపుకు సంబంధించిన కార్డుల వారీగా పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని పోయకుండా నిల్వలుగా చూపించి పక్కదారి పట్టిస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలోని చుంచుపల్లి మండలం, రామాంజనేయ కాలనీలో

మిగతా 2 లో...



## తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 21, ప్రజాజ్యోతి:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం పదవ తరగతి పరీక్షల ప్రారంభంలో భాగంగా తొలిరోజు కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని లిటిల్ బర్డ్స్ పాఠశాల , పాల్వంచలోని కేటీపీఎస్ కాలనీలో, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఏర్పాటుచేసిన వసతులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాసే తరగతులను, సీసీ కెమెరాలు అమరిక, పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యార్థులు కూర్చుని పరీక్ష రాసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బెంచీలను గమనించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పరిక్షా కేంద్రాల

మిగతా 2 లో...

## ఐ.పి.ఎల్... బెట్టింగ్ షురూ!

నేటి నుంచి ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానుంది. యువతతో పాటు మిగిలిన వారికి క్రికెట్ మోజు వల్ల బెట్టింగ్ కు దారి తీస్తుంది. రూ.1000 నుంచి రూ. లక్షల్లో బెట్టింగులు పెడుతుంటారు. జిల్లాలో ప్రధాన ప్రాంతాలతో పాటు ఇల్లందులోని కొత్త బస్టాండ్, గోవింద్ సెంటర్, 24 ఏరియా, 21పిట్, స్టేషన్ బస్తి, బుగ్గ వాగు ఏరియా, కూరగాయల మార్కెట్, సీతారామ టాకీస్ ఏరియా, జగదాంబ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, జేకే కాలనీ, కరెంట్ ఆఫీస్ ఏరియాలలో జోరుగా బెట్టింగ్ లు నడిచే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

◆ ఇల్లందు, ప్రజాజ్యోతి





- అన్ లైన్ లోనే జోరుగా బెట్టింగ్?
- ప్రధాన అడ్డాలలో గుట్టుగా సాగనున్న బెట్టింగ్
- ఐపీఎల్ బెట్టింగ్ లకు కళ్లెం వేసేనా?
- ఇండియా వేదికగా ఐపీఎల్
- నేటి నుంచి ప్రారంభం..
- 74 మ్యాచ్ లు
- మే 25న ఫైనల్ మ్యాచ్

2 లో..

## మత సామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్ విందు

(మొదటి పేజీ తరువాయి... )

ఉద్యోగులకు నిర్వహించిన ఇఫ్తార్ విందులో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముస్లిం సోదరులు రంజాన్ మాసం అంతా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారన్నారు,పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు లాంటి కార్యక్రమాలు ప్రజలలో సోదర భావాన్ని పెంపొందిస్తాయన్నారు,రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు,అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింల కు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు,అనంతరం ఉద్యోగులు కలెక్టర్ కు కురాన్ ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, సిపిఓ సంజీవరావు, ఏపీ ఆర్వో అజ్గర్ హుస్సేన్, అన్ని శాఖల ముస్లిం ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

## తొలి రోజు పది పరీక్షలు ప్రశాంతం

(మొదటి పేజీ తరువాయి... )



చుట్టూ ప్రహరీ గోడలు సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలను శుభ్రంగా ఉంచుకోవాలని చిత్తు కాగితాలు లేకుండా, విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిబంధన ప్రకారం వసతులు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లకు లోను కాకుండా పరీక్షలు మంచిగా రాయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా వ్యాప్తంగా మొదటిరోజు ఉదయం 9:30 గంటల నుండి ప్రారంభమైన పరీక్షలు మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగాయని, జిల్లావ్యాప్తంగా 12,269 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 99% హాజరు నమోదు అయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారని, తొలి రోజు విద్యార్థులందరూ ప్రశాంతం గా పరీక్షలు రాశారని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులు ఒత్తిడికి గురు కాకుండా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పరీక్ష కేంద్ర సిబ్బందితోపాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుతో సంబంధం లేకుండా దరఖాస్తు తీసుకోవాలి

- నోముల భానుచందర్



**టేకులపల్లి, మార్చి 21, ప్రజాజ్యోతి :** నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించుటకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రేషన్ కార్డుతో మూడి పెట్టడం వలన రేషన్ కార్డు లేని పేద యువత నిరాశకు గురి, మనోవేదనకు గురి అవుతున్నారు అని వారు ఆరోపిస్తున్నారు.గత ప్రభుత్వం 10సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు అని వారు ఆరోపించారు. నేటి ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచిన ఎటువంటి నూతన రేషన్ కార్డులు జారీ చేయలేదు అనివారు ఆరోపించారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తాం అని పాత రేషన్ కార్డు లో ఉన్న పేర్లు ను డిలైట్ చేయమని చెప్పడం.కావున పాత రేషన్ కార్డు లో ఉన్న పేరు డిలైట్ చేసి, కొత్త రేషన్ కార్డులు రాక ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న ప్రజలు ఆన్ లైన్ తీసుకోక చాల ఇబ్బందులు పడుతున్నారు అని వారు ఆరోపించారు. దీని వల్ల నిరుపేదలకు నిరుద్యోగులకు అవకాశాలు లేకుండా పోతాయి అని వారు ఆరోపించారు.నిరుపేద నిరుద్యోగులకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకం, రేషన్ కార్డులు లేక స్కూల్ ఎస్సీ ,ఎస్టి, బీసీ,మైనారిటీ నిరుద్యోగులు ఈ అవకాశాన్నీ వినియోగించుకోలేక పోతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రేషన్ కార్డులకు సంబంధం లేకుండా దరఖాస్తులను స్వీకరించాలి. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరుద్యోగులతో కలిసి ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం అన్ని పివైఎల్ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ తెలిపారు.

# జిల్లాలో అస్థవ్యస్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి... )

ఓ రేషన్ షాపులో ఏకంగా 130 క్వింటాలు పక్కదారి పట్టించినట్లు తెలుసుకున్న సమాచారం మేరకు సంబంధిత తహసీల్దార్ , డిప్యూటీ తహసీల్దార్, సివిల్ సప్లై అధికారులు హుటాహుటినా ఆ రేషన్ షాపుకు వెళ్లి స్టాకు వివరాలు పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి రావడంతో సంబంధిత రేషన్ షాపు డీలర్లు 6–ఎ కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రేషన్ షాపుకు సంబంధించిన ఈ పాస్ విషయంలో స్టాకు వివరాలను చూపెడుతున్నప్పటికీ సంబంధించిన బియ్యాన్ని చూపెట్టలేని పరిస్థితి ఎదురైంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు , సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించాల్సిన రేషన్ షాపులు కంటి తుడుపుగా తెరిచి మమా అనిపిస్తున్నారు. పెనగడప ప్రాంతంలో ఉన్న రేషన్ షాపులో కొంత అక్రమాలు చోటు చేసుకున్నప్పటికీ విషయాలు బయటకు పొక్కకుండా అధికారులు గోప్యంగా ఉంచడాన్ని పలువురు ఆరోపిస్తున్నారు. రేషన్ షాపుల నిర్వహణ తీరుపై సంబంధిత ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే రేషన్ అక్రమ రవాణాకు చెక్కు పెట్టినట్లు అవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### రేషన్ షాపుల నిర్వహణపై సంబంధిత డిటి ని వివరణ కోరగా..

చుంచుపల్లి మండలంలో రేషన్ షాపులు సజావుగానే జరుగుతున్నాయని రామాంజనేయ కాలనీలో ఉన్న రేషన్ షాపులో చూపించాల్సిన బియ్యం నిల్వలు లేక పోవడంతో సంబంధిత రేషన్ డీలర్ పై 6– ఎ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై డిటి మహేష్ ప్రజాజ్యోతికి వివరణ ఇచ్చారు. పెనగడప ప్రాంతంలోని ఓ రేషన్ షాపులో జరిగిన అక్రమమం పై వివరణ కోరితే ఆ షాపులో ఎలాంటి అక్రమం జరగలేదని, పూర్తి స్థాయిలో పరిశీలించామని చెప్పడం విశేషం.

# ఐపిఎల్ బెట్టింగ్ షురూ!

**ఇల్లందు, మార్చి 21, ప్రజాజ్యోతి:** నేటి నుంచి ఐపీఎల్ సీజన్ ప్రారంభం కానుంది. యువతతో పాటు మిగిలిన వారికి క్రికెట్ మోజు వల్ల బెట్టింగ్ కు దారి తీస్తుంది. రూ.1000 నుంచి రూ. లక్షల్లో బెట్టింగులు పెడుతుంటారు. జిల్లాలో ప్రధాన ప్రాంతాలతో పాటు ఇల్లందులోని కొత్త బస్టాండ్, గోవింద్ సెంటర్, 24 ఏరియా, 21పిట్, స్టేషన్ బస్తి, బుగ్గ వాగు ఏరియా, కూరగాయల మార్కెట్, సీతారామ టాకీస్ ఏరియా, జగదాంబ సెంటర్, గవర్నమెంట్ హాస్పిటల్ ఏరియా, జేకే కాలనీ, కరెంట్ ఆఫీస్ ఏరియాలలో జోరుగా బెట్టింగ్ లు నడిచే అవకాశాలు ఉన్నాయని సమాచారం. క్రికెట్ బెట్టింగ్, చెడు వ్యసనాలకు బానిసలై డబ్బుల కోసం యువత చెడు మార్గాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును జైలు పాలు చేసుకున్న సంఘటనలు లేకపోలేదు. క్రికెట్ ను టైమ్ పాస్ గా చేస్తూ ఉండగా ప్రస్తుతం ఐపీఎల్ వల్ల వ్యసనంగా మారిందనే చెప్పొచ్చు. ఐపీఎల్ ప్రారంభం నుంచి ఫైనల్ మ్యాచ్ వరకు జోరుగా బెట్టింగులు కొనసాగుతాయి. రేపటి నుంచి ప్రారంభమైన ఐపీఎల్ లో సుమారుగా 74 మ్యాచ్ లతో కొనసాగనున్నది. ఈ సీజన్ ఐపీఎల్ లో 10 జట్లు పోటీ పడనున్నాయి. మే 25న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. బెట్టింగ్ లకు పాల్పడే వారిని అరెస్ట్ చేసిన ఘటనలు ఉన్న నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు రహస్యంగా ఫోన్లలో మాట్లాడి ఆన్ లైన్ ద్వారానే లావాదేవీలు చేస్తారని సమాచారం.కొన్ని ప్రాంతాలను అడ్డాలుగా చేసుకొని బెట్టింగ్ నిర్వహించడం జరుగుతుంది. ఒకవేళ ఆ ప్రదేశం ఎవరికైనా తెలిసినట్లు అనుమానం వస్తే వేరే ప్రాంతానికి మార్చడం జరుగుతుందని తెలుస్తుంది. మ్యాచ్ జరిగే గంట ముందు నుంచి ఫోన్ లలో కానీ, ఒక ప్రదేశానికి చేరుకొని ఏ జట్టుపై బెట్టింగ్ చేస్తారోనని నిర్ణయించుకుంటారు. అంతే కాకుండా ఒక ఓవర్ లో ఎన్ని ఫోర్లు, సిక్స్ లు, వికెట్స్ పడతాయో కూడా బెట్టింగ్ నిర్వహించడం గమనార్హం. అంతే కాకుండా గతంలో బెట్టింగులు నిర్వహించిన వారే తప్ప కొత్త వారు వస్తే అలాంటిది ఏమి లేదని చెప్పడం విశేషం. పాత వారితో కలిసి వస్తే అంగీకరించడం జరుగుతున్నట్లు తెలుస్తుంది. బెట్టింగ్ లకు పాల్పడే వారు వారి స్థాయిని మించి బెట్టింగ్ లకు పాల్పడుతున్నారని తెలుస్తుంది. పోలీస్ అధికారులు ప్రధాన ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేసి ఐపీఎల్ బెట్టింగులు నిర్వహిస్తున్న వారిపై, బెట్టింగ్ రాయుళ్లను కట్టడి చేయకపోతే జీవితాలు నాశనం అయ్యే ప్రమాదం లేకపోలేదు.

### ఐపీఎల్ బెట్టింగ్ పై ప్రత్యేక నిఘా:

**బత్తుల సత్యనారాయణ, సిఐ, ఇల్లందు**



ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఎక్కడైనా బెట్టింగ్ కు పాల్పడినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుంది. బెట్టింగ్ ల వల్ల జీవితం నాశనం అయ్యే ప్రమాదం ఉంది. తల్లిదండ్రులు యువత నడవడికలపై శ్రద్ధ వహించాలి. బెట్టింగ్ ల వల్ల ఆర్థికంగా నష్టపోయి, చివరకు ప్రాణాలు తీసుకునే పరిస్థితి లేకపోలేదు.

# మైనారిటీ గురుకులంలో చేరాలని ప్రచారం





**ఇల్లందు, మార్చి 21, ప్రజాజ్యోతి:** మైనారిటీ గురుకు లం పిలుస్తుందని 10వ తరగతి విద్యార్థులకు మైనారిటీ కళాశాలలో చేరాలంటూ శుక్రవారం 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద కళాశాల పీడీ నజీముద్దీన్, ప్రసాద్ లు కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరానికి 2025–26 యంపిసి, బైపిసి గ్రూపులకు అడ్మిషన్ల దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ముదస్సర్ హుస్సేన్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం యంపిసి, బైపిసి గ్రూపులలో ముస్లిం, మైనారిటీ, ఎస్సి, ఎస్టి, బిసి, ఓసి విద్యార్థులకు పరిమిత సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాల ధీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తూ, అత్యున్నతమైన లెక్చరర్లతో ఉచితంగా ఈఏపిసెట్, నీట్, జెఈఈ మెయిన్స్, ఐఐటి కోచింగ్ ఇవ్వబడనని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికహారం కోసం 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచారన్నారు. అడ్మిషన్ల కోసం తమ కళాశాలకు నేరుగా వచ్చి సిర్టిఫికెట్లు అందచేయాలని, విద్యార్థి ఆధార్ కార్డు, ఫోటో ఇవ్వాలని సూచించారు. ఇంటర్ మొదటి సంవత్సరం యంపిసి, బైపిసిలలో 80సీట్లకు గాను 60 ముస్లిం మైనారిటీ, బిసి –10, ఎస్సి –5, ఎస్టి –3, ఓసి –2 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ప్రిన్సిపాల్ ముదస్సర్ హుస్సేన్ (9666286874), పిడి నజీముద్దీన్ (9866401175) నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

# భగత్ సింగ్ ఆశయ సాధనకై నేటి యువత నడుంబిగించాలి

- 23 న కాగడాల ప్రదర్శన లో యువకులు పాల్గొనాలనీ పిలుపు
- భూక్యా రమేష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు



**కొత్తగూడెం, మార్చి 21, ప్రజాజ్యోతి :** యువ కిశో రం, స్వాతంత్ర సమర యోధుడు, నేటి యువత కు రోల్ మోడల్ అయిన షహీద్ భగత్ సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం హనుమాన్ బస్తీ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం నాయకులు గూగులో త్ సక్రం అధ్యక్షతన సభ నిర్వహిం చడం జరిగింది. ఈ సంద ర్భంగా సిపి ఎం జిల్లా కమిటీ సభ్యుడు భూక్య రమే ష్మాట్లాడుతూ నాటి బ్రిటిష్‌పాలకు లకు వ్యతిరేకంగా భారత ప్రజల ప్రజా స్వామ్య పద్ధతు లకు రక్షించాలని లౌకి క భారతదేశా న్ని బ్రిటిష్ చెరసాలల నుండి కాపాడా లని కోరుతూ అనేక పోరాటాలు తనదైన శైలిలో నిర్వహిం చి నేటి యువతరానికి దిక్సూచిగా నిలిచిన భగత్ సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి యువకుడు నడుం బిగిం చాలని లౌకిక ప్రజాస్వామ్య దేశాన్ని మతోన్మాద కబంధ హస్తాల నుండి రక్షించాలని ఆయన అన్నారు . స్వా తంత్ర పోరాటం లో ముగ్గురు యువకి శోరాలను భగత్ సింగ్, రాజగురు ,సుఖదేవ్ లను బ్రిటిష్ ప్రభుత్వం ఉరికంబాన్ని ఎక్కించే ప్రజలకు దూరం చేయాలనే ఆలోచనతో ఉరి శిక్ష విధించినటు వంటి ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం దానికి వెరవకుండా, భయ పడకుండా ఉరికంబాన్ని చిరునవ్వుతో ముద్దాడిన ముగ్గురు యువకిశోరాల మరణం నాటి యువతరానికి స్ఫూర్తినీ రగి లించి లక్షలాదిమంది యువకులు స్వా తంత్ర పోరాటంలో పాల్గొనే విధంగా చేశారు. అదే స్ఫూర్తితో నేడు బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అలంభిస్తూ ప్రజల మధ్యన చిచ్చు పెడుతూ మతోన్మాదుల విధానాలకు ఎండగట్టి , ప్రజా ఉద్య మం లో ప్రతి ఒక్క యువకుడు దేశ రక్షణ కోసం ఉద్యమించాలని అవ సరమైతే మరో స్వతంత్ర పోరాటానికి నడుం బిగించాలని ఆయన కోరారు. 23వ తేదీన కొత్తగూడెం పట్టణంలో యువకులతో భారీ కాగడాల ప్రదర్శన సూప ర్ బజార్ సెంటర్లో భారీ బహి రంగ సభ ఏర్పాటు చేయను న్నట్లు తెలిపారు . ఈ సభలో అత్యధిక మంది యువ కులు పాల్గొని జయప్ర దం చేయాలని కోరారు. ఈ కార్యక్ర మం లో సిపిఎం నాయకులు ఎన్,ఎస్ రా జు, గుగులోత్ సక్రం, వై వెంకటేశ్వర రావు, బాబురా వు రాజారాం, రామ కృష్ణ, గిరి వేణు ,అల్తాఫ్, అయూబ్ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో చలివేంద్రాలు ఉపయోగకరం

- ఎంపీడీవో జమలారెడ్డి



**బూర్గంపహాడ్, మార్చి21, ప్రజా జ్యోతి :** వేసవి ఎండల దృష్ట్యా బాటసారు లు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగ కరమని ఎంపీడీవో జమలారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మోరంపల్లి బంజర్ సెంటర్ నందు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉందని, ప్రయాణికులు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజల దాహార్తి నిమిత్తం ప్రధాన కూడళ్లల్లో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ భవాని, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ



**భద్రాచలం కల్చరర్ , మార్చి 21, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవర్లకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాం గ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహర ణం తదితర నిత్యపూజలు జరిపారు. స్వామివారి నిత్యక ల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

# మార్చి 25న హమాలీ యూనియన్ల విలీనసభను జయప్రదం చేయండి

**ఇల్లందు , మార్చి 21, ప్రజాజ్యోతి :** మార్చి 25న హైదరాబాద్ లో రెండు హమాలీ యూనియన్ల విలీనసభను జయప్రదం చేయాలని హమాలీ ఫెడరే షన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి కోరారు. శుక్రవారం ము కుందాపురం ఏరియాలో హమాలీ కార్మికులతో నిర్వహించిన ప్రచారం లో ఆయన మాట్లాడుతూ నిత్యం బరువులు మోసే హమాలీ కార్మికులకు ప్రభు త్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 50 సంవత్సరాల వయసు దాటిన హమాలీలకు నెలకు రూ.6000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో హమాలి ఫెడరేషన్ జిల్లా నాయకులు తొండల సర్వయ్య, అయిలు ఉప్పలయ్య, జానీ, అశోక్, శ్రీను, నరేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.



# వార్షిక ఉత్పత్తి సాధించిన ఇల్లందు

- ఇల్లందు ఏరియా జిఎం వి. కృష్ణయ్య

**ఇల్లందు, మార్చి 21, ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాకు 2024–25 వార్షిక ఉత్పత్తి సంవత్సరానికి గాను నిర్దేశించిన 41.30 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని 11 రోజులు ముందుగానే అధిగమించడం జరిగిందని శుక్రవారం ఏరియా జిఎం వి. కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఇల్లందు ఏరియా మార్చి 21 నాటికి 41.35 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 100.12 శాతంతో అన్ని ఏరియాల కంటే 11 రోజుల ముందుగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి ఇల్లందు ఏరియా ప్రథమ స్థానంలో నిలువడం జరిగిందన్నారు. ఈ లక్ష్య సాధనకు ఉద్యోగులు నిబద్ధతతో పని చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులోనూ ఇల్లందు ఏరియా మరెన్నో రికార్డులు సాధించేందుకు కృషి చేయాలని, సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం సాధించినందుకు అధికారులు, సూపర్వైజర్లు, అధికారుల సంఘం, యూనియన్ నాయకులు, ఉద్యోగులకు అభినందనలు తెలిపారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు



**పాల్వంచ( రూరల్ ), మార్చి 21,ప్రజా జ్యోతి :** పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) లో ప్రపంచ కవితా దినోత్సవాన్ని శుక్రవారం ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.పద్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఆంగ్లభాషను నేర్చుకోవడం ఎంతో ఉపయోగకరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కవి తల ద్వారా సామాజిక వికాసానికి ఇంగ్లీష్ కవులు చేసిన సేవలను వివరించారు. రేష్మ, జీవన్ కుమార్ లు పి.పి.టి ద్వారా షేక్స్పియర్ జీవితాన్ని వివరించగా, విద్యార్థి అర్జున్ ప్రపంచ కవితా దినోత్సవ ప్రాముఖ్యతను ఆంగ్లంలో వివరించాడు. సునంద ఇంగ్లీష్ కవుల జీవిత చరిత్రలను, వారి కవిత్వ విశిష్టతను తెలియజేశారు. హర్షిణి, లోహిత తదితర విద్యార్థినులు షేక్స్పియర్, రవీంద్రనాథ్ ఠాగూర్, ఇలియట్, ఆర్.కే. నారాయణన్, డికెన్సన్, సరోజినీ నాయుడు కవితలను రాగయుక్తంగా ఆలపించారు. కళాశాల విద్యార్థులు కార్తీక్, పార్వతి ఇంగ్లీష్ వార్తా పత్రికను చదివే విధానాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ విభాగాధిపతులు లీలా సౌ మ్య, భాను ప్రవీణ్ ఆంగ్ల కవితా సంపుటిని ప్రిన్సిపల్ చేత ఆవిష్కరించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.మాధవి, డాక్టర్ టి.అరుణకుమారి,డాక్టర్ కామేశ్వరరావు, రమేష్, శ్రీనివాసరావు, విమల, దీపిక, మాధవి, కావ్య తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



**బూర్గంపహాడ్, మార్చి 21, ప్రజా జ్యోతి :** ఆశా వర్కర్ల సమస్యలను తక్షణమే పరిష్కారం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పాండవుల రామనాథం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం మోరంపల్లి బంజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పిం చాలని కోరారు. అనంతరం పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ కు సమస్యలతో కూడి న వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో కన్వీనర్ గుంటక కృష్ణ, ఆశ వర్కర్లు బుచ్చమ్మ, తారా దేవి, పి చిట్టెమ్మ, కళావతి, భారతి, నాగమణి, బాయమ్మ, కృష్ణవేణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# బ్రిలియంట్ లో 23న జిల్లా స్థాయి ఎంసెట్ మోడల్ పరీక్ష



**బూర్గంపహాడ్, మార్చి 21, ప్రజా జ్యోతి :** ఎంసెట్ ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష పై అవగాహన కల్పిం చుటకు సారపాక బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జిల్లా స్థాయి ఎంసెట్ మోడల్ పరీక్షను నిర్వహిం చనున్నట్లు బ్రిలియంట్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ బిఎన్ఆర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఎంసెట్ పరీక్ష వ్రాయు విద్యార్థు లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్ పరీక్షలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.ఈ మోడల్ పరీక్ష వ్రాయు విద్యార్థులు ఒక రోజు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకో గలరని పూర్తి వివరాలకు 9866283566,9705137128 నెంబర్లకు లేదా బ్రిలియంట్ జూనియర్ కాలేజ్ నందు సంప్రదించగలరు.

## శ్రీరామనవమికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయొద్దు

- అప్పగించిన పనులు అధికారులు పూర్తిచేయాలి
- ఆర్డీవో దామోదరరావు





**భద్రాచలం, మార్చి 21, ప్రజాజ్యోతి :** భద్రాచలం పుణ్యక్షేత్రానికి శ్రీ రామనవమి, మహాపట్టాభిషేకం ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తనీయొద్దని భద్రాచలం ఆర్డీవో దామోదరరావు అన్నారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం కార్యక్రమానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయా శాఖల అధికారులకు అప్పగించిన పనులు పూర్తిచేయాలన్నారు. పనులను పకడ్బంధీగా నిర్వహించి విధుల్లో అలసత్వం లేకుండా చూడాలన్నారు. మిథిలాస్టేడియంలో కల్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించామని, ప్రతి సెక్టార్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేడుకలు వీక్షించేలా జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గత సమావేశంలో కలెక్టర్ సూచించిన విధంగా ప్రత్యేక అధికారులు భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్కు వెళ్లకుండా పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఆన్లైన్ ద్వారా లాడ్జీలు బుక్ చేసుకునేలా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. సెక్టార్లో విధుల నిర్వహణకు పారిశుధ్య సిబ్బందిని ప్రత్యేకంగా నియమించడం జరుగుతుందని, ఇప్పటివరకు విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపుకార్డులు జారీచేస్తామని, పారిశుధ్య పర్యవేక్షణకు 25 జోన్లుగా విభజించి అధికారులను కేటాయించడం జరిగిందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు, మంచినీటి సరఫరా చేసే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, 200 మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని, పర్యవేక్షణకు 30 మంది, మంచినీటి పరీక్షల నిర్వహణకు 12 మంది సిబ్బందిని నియమించి ప్రతి సెక్టార్లో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. పార్కింగ్, అగ్ని ప్రమాదాల నివారణకు ఆయా శాఖల ద్వారా బృందాలను సిద్ధం చేసి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు 25 సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాలు పూర్తయ్యేంతవరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుశాఖ, వివిధ శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి వేడుకల విజయవంతానికి కృషిచేయాలని సూచించారు. ఈ సమీక్షలో ఆలయ ఈవో రమాదేవి, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, తహశీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఖాజా గౌస్ కు ఘన సన్మానం



**ఇల్లందు, మార్చి 21, ప్రజాజ్యోతి :** ఏఐసిసి అనుబంధ కిసాన్ ఖేత్ నేషనల్ కో – ఆర్డినేటర్ గా నియమితులైన ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ కార్యదర్శి, ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యండి. ఖాజా గౌస్ మోహినుద్దీన్ ను శుక్రవారం ఖమ్మం సిటీ మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్. కె. అబ్బాస్ బేగ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఖాజా గౌస్ మోహినుద్దీన్ కు ఏఐసిసి అనుబంధ కిసాన్ ఖేత్ నేషనల్ కో – ఆర్డినేటర్ గా నియమితులవ్వడం సంతోషకరమన్నారు. ఖాజా గౌస్ మోహినుద్దీన్ కు రానున్న రోజుల్లో పార్టీలో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఫరీద్ ఖాదిరి, షేక్ రియాజ్, షేక్ మహబూబ్, షేక్ ముజాహిద్, షేక్ ఇర్ఫాన్, మొహమ్మద్ ఆఫీస్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పై ఎస్ బి ఐ కళాబృందం అవగాహన




**టేకులపల్లి, మార్చి 21, ప్రజాజ్యోతి :** మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు రీజినల్ మేనేజర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు టేకులపల్లి ఎస్ బి ఐ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో కళాబృందం చక్కటి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎస్ బి ఐ మేనేజర్ మాట్లాడుతూ.. మొబైల్ ద్వారానే 90 శాతం సైబర్ నేరాలు జరుగుతున్నాయన్నారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకుని సైబర్ నేరాలకు కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మురళి , ఎస్ బి ఐ క్యాషియర్ రాకేష్, నరేష్, కృష్ణ, బిచ్చు, అఖిల్, ప్రసాద్, ఎస్ బి ఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు కోరం

**టేకులపల్లి,మార్చి 21, ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ ఇప్పలతండా గ్రామం నందు సీసీ రోడ్డు నిర్మాణ పనులను, కిష్టారం పంచాయితీ కొమ్మలంక గ్రామం నందు సీసీ రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ప్రారంభించారు.మండలంలోని కిష్టారం గ్రామం నందు ఏప్రిల్ మూడో తారీకు జరగబోయే రామాలయ ప్రతిష్ట కార్యక్రమం సందర్భంగా ఆలయ ఆవరణలో గ్రావెల్ వేయించాలని గ్రామస్తులు కోరడంతో కోయగూడెం ఓపెన్ కాస్ట్ కే ఓ సి అధికారుల సహకారంతో గ్రావెల్ వేయిస్తామని హామీని జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ఇచ్చారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఈది గణేష్, బానోత్ రవి,నవీన్, లక్ష్మణ్, రంగిలాల్, రవి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## పెద్దమ్మ తల్లి దేవస్థానం నూతన కమిటీలో స్థానికులకు చిన్న చూపు

- పెద్దమ్మ తల్లి నీ బిడ్డలకి నువ్వే న్యాయం చేసి ఆదుకోవాలి అమ్మ





**పాల్వంచ రూరల్ , మార్చి 21,ప్రజా జ్యోతి :** పాల్వంచ మండలం కేశవాపురం జగన్నాథపురం గ్రామంలో వెలిసి యున్న కనకదుర్గ దేవస్థానం నూతన కమిటీలో స్థానికుల కు అవకాశం కల్పించలేదంటూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లి అమ్మవారి గుడిలో వినతిపత్రం సమర్పించారు.గంధం నరసింహారావు మాట్లాడుతూ కేశవాపురం, జగన్నాథపురం గ్రామస్తులు అనేక ఏళ్లుగా అమ్మవారి సేవలో దేవాలయ అభివృద్ధికి, విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. అలాంటిది ఇప్పుడు నూతన పాలకమండలిలో స్థానికులను విస్మరించి కొత్తవారిని తీసుకోవడం ఏంటంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని గమనించి, స్థానికులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కొండం పుల్లయ్య, పెద్దయ్య, బానోత్ కుమార్, వీరభద్రం, గంధం సతీష్, లక్ష్మణ్, దేవ, వెంగళరావు, సత్యనారాయణ,రమేష్, ఉదయ్, నాగేష్, కృష్ణ, భాస్కర్, రాము, మహేష్, శ్రీను, జంపన్న, నరసింహ, నాగేశ్వరరావు, లిఖిత్,సతీష్,స్వరూప,శ్రీరంగ,దేవి,కళ్యాణి,మల్లీశ్వరి,సుమ,సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల్లో 'మధ్యాహ్న భోజన' కార్మికులు



**టేకులపల్లి, మార్చి21, ప్రజాజ్యోతి :** మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమస్యల్లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. అరకొర వసతులతో అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నా తమకు కనీస వేతనం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతి కొద్ది వేతనంతో కుటుంబాలను పోషించలేక చాలా మంది మధ్యాహ్న భోజనం కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిల్లులు, గుడ్ల బిల్లులు పెండింగ్లో వున్నాయి. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీల అవస్థలు తనకు తెలుసని వారికి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.పది వేల వేతనం అందించి ఆదుకుంటామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చేసరికి ఇద్దరూ ఆ హామీని గాలికి వదిలేశారు. రెండు సంవత్సరాలు అవుతున్నా మధ్యాహ్న భోజనం పథకం బిల్లులు అందక వంట చేసిన నిర్వాహకులు నానా ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, వి. పద్మ, ఈసం రాణి, సిఐటియు మండల నాయకులు కదుదుల వీరన్న తదితరులు పాల్గొన్నారు.